RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 239 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 3 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## పథకాలతో ప్రజలను... పదవులతో నేతలను...

# మెప్పించి




### మెజార్టీ పార్లమెంటు స్థానాలపై రేవంత్ గురి

హైదరాబాద్ : తెలంగాణలో రాష్ట్రం ఆవిర్భవించిన పదేళ్ల తర్వాత.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ప్రస్తు త సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలపై దృష్టి పెట్టారు. మొత్తం 17 లోక్‌సభ సీట్లలో కనీసం 12-15 స్థానాల్లో విజయం దక్కించుకునే వ్యూహంతో ఆయన అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తొలి అడుగుగా.. పార్టీలో సీనియర్ల అసంతృప్తులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు .. పదవులు ఇచ్చి, వచ్చే ఎన్నికల్లో మరోసారి వారిని వాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సీనియర్ నాయకులకు వివిధ కార్పొరేషన్లలో ఉన్న నామినేటెడ్ పదవులు ఇచ్చే ప్రక్రియను సిఎం రేవంత్ మొదలు పెట్టారు. దీనికి సంబంధించి ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఒక్కో నియోజక వర్గం నుంచి సుమారుగా నాలుగు నుంచి ఐదు పేర్లను తెప్పించుకున్నట్టుగా తెలిసింది. అందులో భాగంగా ముందస్తుగా 18 నుంచి 20 మందికి నామినేటెడ్ పోస్టులను కేటాయించాలని సిఎం నిర్ణయించారని పార్టీ వర్గాల్ల ఓ చర్చ సాగుతోంది. త్వరలోనే వీటికి సంబంధించి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. సిఎం కూడా వారి పేర్లకు ఆమోదముద్ర వేయడంతో పాటు ఆ జాబితాను ఢిల్లీ అధిష్టానానికి పంపించి వాయువేగంతో అనుమతి తెప్పించుకుని.. నియామకాలు చేస్తారని తెలిసింది తద్వారా.. పార్లమెంటు ఎన్నికల సమయా నికి పార్టీలో అసంతృప్తులు ఎవరూ ఉండరాదనే కాన్సెప్టుతో రేవంత్ ఉన్నారని స్పష్టమవుతోంది. ఇప్పటికే ముఖ్య నేతలు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవి, హర్కర వేణుగోపాల్ రెడ్డిలకు క్యాబినెట్ ర్యాంక్‌ను కల్పి స్తూ అడ్వైయిజర్ పోస్టులు ఇచ్చారు. వీరిని పార్లమెంటు ఎన్నికల్లో కీలక బాధ్యతలకు వినియోగించనున్నారు. ఈ క్రమంలోనే త్వరలో మరో 18 నుంచి 20 మంది కీలక నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సిఎం భావిస్తున్నట్టుగా తెలిసింది. మొత్తానికి ఇటు పథకాలతో ప్రజలను.. అటు పదవులతో నేతలను మెప్పించి.. పార్లమెంటు ఎన్నికల్లో పక్కా విజయం దక్కించుకునే లక్ష్యంతో రేవంత్ దూకుడు ప్రదర్శిస్తున్నారని అంటున్నారు పరిశీలకులు.

## ఈ సారి 'మంట'లే...!

### భాగ్యనగరంలో భారీగా పెరగనున్న ఎండలు!!



హైదరాబాదీలకు భారత వాతావరణ శాఖ షాకింగ్ న్యూస్ చెప్పింది. ఈసారి ఎండలు మండిపోయే అవకాశం ఉందని పేర్కొంది. ఫిబ్రవరిలో ఎండలు ఎక్కువగా ఉంటే మార్చిలో మరింత ఎక్కువగా ఎండల తీవ్రత ఉండే అవకాశం ఉంది. సాధారణంగా ఎండకాలం మార్చి 21 మొదలు కావాల్సి ఉంది. కానీ ఈసారి వేసవి మార్చి ప్రారంభంలో వస్తుందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. మార్చి మొదటి వారంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా సగటు పరిధిలోనే ఉంటాయనిహైదరాబాద్ ఐఎండీ అధికారి డాక్టర్ ఎ శ్రావణి అంచనా వేశారు. రెండో వారంలో ఉష్ణోగ్రతలు బహుశా పెరగొచ్చని చెప్పారు. ఇది ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. "వేసవి ఊహించిన దాని కంటే త్వరగా వస్తున్నట్లు సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి" అని అన్నారు. ఫిబ్రవరిలో సాధారణం కంటే ఎక్కువ వేడి, తేమ ఉన్నట్లు అనిపించినప్పటికీ, ఈ పరిస్థితులు సంవత్సరంలో ఈ సమయానికి విలక్షణంగా ఉన్నాయన్నారు. ఫిబ్రవరిని వాతావరణ కల్లోలం నెలకొందని, హైదరాబాద్‌లో అనూహ్య వాతావరణం నెలకొందని ఆమె పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలో ఆకస్మిక తగ్గింపులు, హెచ్చుతగ్గులు, అలాగే పొగమంచు, మేఘావృతమైన ఆకాశంతో సహా అనేక మార్పులను గమనించినట్లు వివరించారు. మార్చి 5 వరకు నగరంలో ఆకాసం పాక్షికంగా మేఘావృతమై, పొగమంచు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే అత్యధిక ఉష్ణోగ్రత సగటున 35 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చు అంచనా వేశారు. ఇక రాత్రి కనిష్టంగా 23 డిగ్రీల సెల్సియస్ ఉండే అవకాశం ఉందన్నారు. మొత్తానికి ఈసారి ఎండకాలం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఎండలు మండిపోవడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మరోవైపు భూగర్భ జలాలు అడుగట్టుతున్నాయి. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో నీటి ఎత్తడి నెలకొంది. దీంతో చాలా మంది ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుంటున్నారు. అటు వ్యవసాయానికి కూడా నీరు అందడం లేదు. చూడాలి ఈసారి సమ్మర్ ఎలా ఉంటుందో.. ఎన్ని సమస్యలు తీసుకొస్తోందో.



## బీఆర్ఎస్‌కు ఓటేస్తే మునిగిపోయినట్లే

### 17ఎంపీ స్థానాలూ బీజేపీవే..

**- విజయ సంకల్పయాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

రాంనగర్(హైదరాబాద్): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 సీట్లనూ బీజేపీ సాధిస్తుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించారు. సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మునిగిపోయినట్లేనని అన్నారు.




# కమలదళం సిద్ధం

## బీజేపీ తొలి జాబితా విడుదల..

### మోదీతో సహా 34 మంది కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. 195 మంది అభ్యర్థులు మొదటి లిస్ట్‌లో చోటుచేసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి మరోసారి పోటీ చేయనున్నారు. అమిత్‌షా గుజరాత్ గాంధీ నగర్ నుంచి, సుష్మా స్వరాజ్ కుమార్తె బాన్సుర స్వరాజ్ న్యూఢిల్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేయనున్నారు. 34 మంది కేంద్ర మంత్రులు ఈ జాబితాలో చోటుచేసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ నేతలు ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే విడుదల చేశారు. 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 195 స్థానాలకు అభ్యర్థులను సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మీటింగ్‌లో ఖరారు చేసినట్టు తావడే తెలిపారు. బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాలో 28 మంది మహిళలు, 47 మంది యువకులు, 18 గిరిజన తెగల అభ్యర్థులు ఉన్నారు. పశ్చిమబెంగాల్ నుంచి 26 మంది అభ్యర్థులను ప్రకటించగా, మధ్యప్రదేశ్ నుంచి 24 స్థానాలు, గుజరాత్ నుంచి 15 స్థానాలు, రాజస్థాన్-15, కేరళ-12, తెలంగాణ-9 మంది, ఢిల్లీ-5, జమ్మూ-2, ఉత్తరాఖండ్-2, గోవా-1, త్రిపుర-1, అండమాన్ 1 స్థానానికి అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఎన్డీయేకు 400 సీట్ల లక్ష్యంగా బీజేపీ ముందుకు వెళ్తుందని, బీజేపీకి 370కి పైగా సీట్లు వస్తాయని ఈ సందర్భంగా తావడే, అర్జున్ పాండే ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ మోదీ నేతృత్వంలోనే బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నట్టు చెప్పారు.

**తెలంగాణ :** కరీంనగర్ - బండి సంజయ్‌కుమార్, నిజామబాద్- ధర్మపురి అర్వింద్, జహీరాబాద్- బీబీ పాటిల్, మల్కాజ్‌గిరి- ఈటల రాజేందర్, సికింద్రాబాద్- కిషన్ రెడ్డి, హైదరాబాద్- డాక్టర్ మాధవీ లత, చేవెళ్ల - కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నాగర్ కర్నూలు- పి. భారత్, భువనగిరి- బూర నర్సయ్య గౌడ్, కేరళలోని త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి సినీ నటుడు సురేశ్ గోపి, తిరువనంతపురం నుంచి కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పోటీ చేయనున్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా మరోసారి పోటీ చేయనున్నారు. యూపీలోని లఖ్‌నవూ స్థానం నుంచి రాజనాథ్ సింగ్, అమేఠీ స్థానం నుంచి స్మృతీ ఇరానీ మరోసారి పోటీ చేయనున్నారు.

**పంతం నెగ్గించుకున్న ఈటల.. హైదరాబాద్ నుంచి హీరోయిన్ పోటీ! :** రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం బీజేపీ(%దీజ్రీ%) దూకుడు పెంచింది. అత్యధిక ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. కార్యచరణలో భాగంగా శనివారం నాడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ హై కమాండ్ విడుదల చేసింది. ఈ తొలి జాబితాలో తెలంగాణ నుంచి 9 మంది అభ్యర్థులకు అవకాశం కలిపించింది.

**లెక్క తేలేదెప్పుడో..?** మహబూబ్‌నగర్ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టిన బీజేపీ అధిష్టానం. మహబూబ్‌నగర్ సీటు కోసం డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంతికుమార్ మధ్య తీవ్ర పోటీ.

రకరకాల ఊహాగానాల మధ్య మల్కాజ్‌గిరి సీటును దక్కించుకున్న ఈటల రాజేందర్. మల్కాజ్‌గిరి టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నేత మురళీధర్‌రావు. పార్టీలో చేరిన వెంటనే టికెట్ దక్కించుకున్న బీబీ పాటిల్. నాగర్‌కర్నూల్ సీటును తన కుమారుడు భరత్ కు ఇప్పించుకున్న ఎంపీ పీ.రాములు. హైదరాబాద్ లో ఓవైసీపై పోటీ చేస్తోన్న మాధావీలత. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు నిరాశ.

**పెండింగ్ ఎందుకో..? :** ప్రస్తుతం ఉన్న నలుగురు సిట్టింగ్ ఎంపీలకు ఈసారి కూడా టికెట్లు ఖరారయ్యాయి. అయితే బీజేపీ హై కమాండ్ వెల్లడించిన తొలి జాబితాలో సోయం బాపురావు పేరు లేకపోవడం గమనార్హం.

తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలుండగా.. తొలి జాబితాలో 9 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. మరో 08 స్థానాల్లో కూడా పలువురి అభ్యర్థుల పేర్లను పరిగణనలోకి తీసుకుంది. ఇందుకోసం.. ఒక్కో సీటుకు రెండేసి పేర్లతో.. మరో జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పవన్ తో ముద్రగడ ఢీ కొడతారా...!?

జనసేన అధినేత అన్నీ ఆలోచించుకుని మరీ పిఠాపురం సీటు నుంచి పోటీకి సిద్ధపడుతున్నారు. పిఠాపురంలో మొత్తం జనాభాలో అత్యధిక శాతం కాపులు ఉన్నారు. దాంతో ఈ సీటు నుంచి పోటీ చేస్తే గెలుపు ఈజీ కావడమే కాదు, మెజారిటీ కూడా భారీగా ఉంటుందని పవన్ భావిస్తున్నారు అని అంటున్నారు. ఈ మేరకు లోకల్ జనసేన నేతలకు పవన్ పూర్తి సమాచారం ఇచ్చారని అంటున్నారు. దాంతో పిఠాపురం నుంచి పవన్ పోటీ అన్నది కన్ ఫర్మ్ చేస్తూ గ్రౌండ్ లెవెల్ లో జనసేన నేతలు వర్క్ స్టార్ట్ చేశారు. తొందరలో వచ్చే లిస్ట్ లో పవన్ పోటీ చేసే సీటు పిఠాపురం అని ఖరారు చేయడమే మిగిలింది. ఈ వార్తతో అధికార వైసీపీ ఫుల్ అలెర్ట్ అయింది. వైసీపీ పవన్ ని ఓడించాలని చూస్తోంది అన్నది తెలిసిందే. 2019 ఎన్నికల్లో పవన్ రెండు చోట్ల పోటీ చేస్తే రెండు చోట్ల ఓటమి పాలు అయ్యారు. నాడు అలా స్కెచ్ గీసిన వైసీపీ ఇపుడు పిఠాపురం లో కొత్తరకం స్కెచ్ గీస్తోంది. పిఠాపురంలో పవన్ కి ప్రత్యర్ధిగా బలమైన అభ్యర్ధిని దింపాలని చూస్తోంది అని అంటున్నారు. పిఠాపురం నుంచి కాపు నేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని దించాలని వైసీపీ చూస్తోందని అంటున్నారు. పవన్ కళ్యాణ్ కి ఘాటుగా తాజాగా లేఖ రాసి ముద్రగడ జనసేన వైపు చూడనని చెప్పేశారు. దాంతో ముద్రగడ రాజకీయం విషయంలో ఒక క్లారిటీకి వచ్చిన వైసీపీ ఆయనతో సంప్రదింపులకు తెర తీసింది అని అంటున్నారు. ఈసరికే ముద్రగడ చిన్న కుమారుడుతో వైసీపీ పెద్దలు చర్చలు జరిపారు అని అంటున్నారు. ముద్రగడ పద్మనాభం వస్తే కనుక ఆయనకు టికెట్ ఇస్తామని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఒకవేళ ఆయన నో అంటే ఆయన కుమారుడికి టికెట్ ఇవ్వాలని చూస్తున్నారు. ఆ విధంగా ముద్రగడను ముగ్గులోకి లాగి పవన్ మీద గట్టి పోటీ చేయించాలన్నది వైసీపీ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. ఈ పరిణామాల నేపధ్యంలో పిఠాపురం వైసీపీ ఇంచార్జిగా ఉన్న వంగా గీతను హుటాహుటీగా వైసీపీ హై కమాండ్ పిలిపించుకుని మరీ చర్చలు జరిపినట్లుగా తెలిసింది. పవన్ కళ్యాణ్ పోటీలో ఉంటే ముద్రగడ కానీ ఆయన ఫ్యామిలీ కానీ ఉంటేనే బెటర్ అని వైసీపీ పెద్దలు తమ ఆలోచనలు ఆమెతో చెప్పి పిఠాపురం మీదనే డిస్కషన్ చేశారని అంటున్నారు. వంగా గీతకు పిఠాపురం నుంచి పక్కన పెట్టి వేరే అసెంబ్లీ సీటు ఇస్తారని అంటున్నారు. మొత్తం మీద పవన్ ని మరోసారి ఓడించడం ద్వారా ఆయన రాజకీయ జీవితానికి ఈసారి పూర్తి స్థాయిలో ఫుల్ స్టాప్ పెట్టాలని వైసీపీ చూస్తోంది అని అంటున్నారు.

మరి ముద్రగడ రెడీ అవుతారా. వైసీపీ నుంచి పోటీ చేసి పవన్ ని ఢీ కొడతరారా అన్నది చూడాల్సి ఉంది.

# యాసంగి పంటలు గట్టెక్కేనా!



పెద్దపల్లి : కాళేశ్వరం పథకంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో పలు బ్లాక్‌లు కుంగిపోవడం, బుంగలు ఏర్పడటంతో లక్ష్మీ, సరస్వతి, పార్వతీ జలాశయాల్లోని మొత్తం నీటిని దిగువకు వదిలారు. ఈసారి ఎల్లంపల్లి ద్వారా మొత్తం 2.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు 17 టీఎంసీలకు పైగా సాగునీరు ఇవ్వాల్సి ఉండగా కేవలం 20 వేల ఎకరాలకు 2 టీఎంసీల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు.

ఎల్లంపల్లిలో నీటి నిల్వలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఈ జలాశయంలో 20.17 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 11 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 19 టీఎంసీల నీరుంటే ప్రస్తుతం 8 టీఎంసీల మేర తక్కువగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్లంపల్లి ద్వారా మంచిర్యాల జిల్లా గూడెం పంపుహౌస్‌కు 290 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వర్క్స్‌కు 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ పెద్దపల్లికి 120 ఎంఎల్‌డీలు, మంచిర్యాల జిల్లాకు 80 ఎంఎల్‌డీలు అంటే 78 క్యూసెక్కుల మేర మిషన్ భగీరథ అవసరాలకు తరలిస్తున్నారు. ఈ యాసంగిలో రైతులు ఆరుతడి పంటలకు బదులు అధిక విస్తీర్ణంలో వరి సాగు చేయడంతో అదనంగా నీటి కేటాయింపులు అవసరమవుతున్నాయని, ఇప్పటికైనా పొదుపుగా వినియోగిస్తేనే పంటలు దక్కుతాయని నీటిపారుదల శాఖ రామగుండం సర్కిల్ ఇన్‌ఛార్జి సీఈ సుధాకర్‌రెడ్డితో అన్నారు. వారబందీ పద్ధతిలో మార్చి 31 వరకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా సరఫరా చేస్తామన్నారు. అదనంగా నీటి తడులు పెంచే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఎత్తిపోతలకు ఇక్కట్లు

ఆరో ప్యాకేజీ కింద 6 పంప్‌హౌస్‌ల ద్వారా సాగునీటిని ఇవ్వాల్సి ఉండగా కొద్ది రోజులుగా సరఫరా నిలిపివేశారు. ఎల్లంపల్లి కింద పాలకుర్తి మండలం వేంనూరు, ధర్మారం మండలం నందిమేడారం పంప్‌హౌస్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు 12 టీఎంసీలకు పైగా సరఫరా చేయాల్సి ఉంటుంది. మంథని-గుండారం ఎత్తిపోతల ద్వారా 28 వేల ఎకరాలకు 2 టీఎంసీలు, మంచిర్యాల గూడెం ఎత్తిపోతల ద్వారా 30 వేల ఆయకట్టుకు 3 టీఎంసీలు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం గూడెంకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని పార్వతీ పంప్‌హౌస్ నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోతలు చేపట్టడంతో జలాశయంలో నీటి నిల్వలు తగ్గలేదు. మంథని నియోజకవర్గంలో ముత్తారం, మంథని, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు నీరందించే గుండారం జలాశయంలోనూ నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. ఎల్లంపల్లి, ఎస్సారెస్పీల ఆధారంగా ఇందులో నీటిని నింపి రైట్ సైడ్ బ్రాంచ్ కెనాల్‌ల ద్వారా ఈ నాలుగు మండలాల ఆయకట్టుకు సరఫరా చేస్తున్నారు. 81.16 మిలియన్ క్యూబిక్ అడుగుల(ఎంసీఎఫ్‌టీలు) సామర్థ్యంతో 28,800 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడే జలాశయంలో నీటి నిల్వలు 50.16 ఎంసీఎఫ్‌టీలకు తగ్గిపోయాయి.

ఎండుతున్న పంటలు

ప్రస్తుతం ఎస్సారెస్పీలో 35.03 టీఎంసీల నీటి నిల్వలే ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా 22.97 టీఎంసీలను వదిలారు. మార్చి 31 వరకే ఆయకట్టుకు నీటిని అందించాలని అధికారులు నిర్ణయించారు. ఈలోగా ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టాలు కూడా తగ్గిపోతే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. జిల్లాలోని డీ-83, డీ-86 కాలువల ద్వారా దాదాపు 1.80 లక్షల ఎకరాలకు 5 వేల క్యూసెక్కుల నీరు అవసరమవుతుంది. ఇప్పటికే కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రాంతాల్లో పంటలు ఎండుతున్నాయి. పలు చోట్ల చెరువులు ఎండిపోవడంతో రైతులకు కష్టాలు రెట్టింపయ్యాయి.

# ప్రతి దానికీ పైసల లెక్కనే!



కరీంనగర్ : ఠాణా పెద్దగా బాధ్యతలు నిర్వహించిన ఓ పోలీసు ఉన్నతాధికారిపై తీసుకున్న చర్య ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.. ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేసిన ఈయనపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు.. ఆయన వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదులతోపాటు నిఘా వర్గాల సమాచారంతో విచారణ చేపట్టి ఇటీవల చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయన పని చేసిన ఠాణాల పరిధిలో అన్ని వర్గాల ప్రజలు ఆయన చేసిన అరాచకాలను తలచుకుంటున్నారు. కేసుల విషయంలో ఆయన వ్యవహార శైలిని గుర్తు చేసుకుంటున్నారు. తాను చెప్పిందే న్యాయం అని ఆయన జులుం చేసిన తీరును చర్చించుకుంటున్నారు. 'ఫోన్‌లో కాదు.. వచ్చి కలువు' అనే ఊతపదాన్ని అందరికి వినిపించే ఈ సారు మామూళ్ల ముచ్చటను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులే విస్తుపోయారట. పరస్పర ఫిర్యాదుల్లో ఇరువర్గాల వద్ద అందినకాడికి చేతివాటం ప్రదర్శించడంలో ఈయనది అందెవేసిన చేయి అని సొంతశాఖ సిబ్బంది గుసగుసలు పెట్టిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఇక భూ పంచాయతీల ఫిర్యాదులు వస్తే చాలు.. వాటిలో ఉన్న అక్షరాలను చదువుతూనే.. 'లక్ష'ణంగా కాసుల పంట పండుతుందనే ఊహల్లో విహరించేవారట.. అందుకోసం ఎంత బెదిరించడానికైనా తెగించేవారనే ప్రచారం ఉంది.

గద్దిస్తూ.. తిట్ల దండకం..!

పెదవులపై చిరునవ్వనేది కనిపించకుండా.. కోపంగా ఉండే సారుగా ఈయన పనిచేసిన చోట పేరు సంపాదించారు. 'నవ్వితే నాకేం లాభం.. కసురుకుంటేనే కదా.. కాసుల వర్షమనేది' ఈ సారు విధానం. అందుకే సారు చేసే ప్రతి పనికి పైసల లెక్క ఉంటదనే ప్రచారం ఆయన పనిచేసిన ప్రతి చోట వినిపిస్తోంది. పైగా ఫిర్యాదుదారుడి బాధ వినకుండా తాను అనుకున్న వారికే న్యాయం చేసేందుకు తిట్ల దండకం అందుకోవడం ఈయన నైజం. ఆయన ఎదురుగా మాట్లాడితే పాపమనే విధంగా గద్దించడంలో ఆయన దిట్టగా పేరొందారు. సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చొద్దని ఉన్నతాధికారులు చెబుతున్నా.. సివిల్ పంచాయతీ అనగానే ఠాణాల్లో పంచాయతీలు పెట్టడం.. నచ్చిన ప్రజాప్రతినిధి, నేతలు, దళారుల పక్షాన నిలబడటంలో ముందుండేవారు. గతంలో ఓ భూ తగాదాలో ఠాణాకు వచ్చిన విశ్రాంత ఉద్యోగి కుటుంబీకులపై ఇష్టానుసారంగా వ్యవహరించడంతోపాటు వారి తరఫున సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన ఓ యువతితో అసభ్యకరంగా మాట్లాడిన తీరుపై అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. భూ వివాదాలను పరిష్కరించే క్రమంలో స్థలాల వద్దకు వెళ్లి అక్కడి వారిపై చేయి చేసుకున్న సంఘటనలున్నా ముఖ్య నేతల మద్దతుండటంతో ఎవరూ ఏమీ చేయలేకపోయారు.. ప్రజాప్రతినిధులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొనే ఆయన ఉమ్మడి జిల్లాలోని ఏ ఠాణా పరిధిలో పని చేసినా తన హవా కొనసాగించారు.

కేసును బట్టి కాసులు..

కొన్ని నెలల కిందట ఆయన పనిచేసిన చోట రూ.3 కోట్ల విలువైన ఓ భూమి విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారని.. ఒక వర్గం నుంచి పెద్ద మొత్తంలో లావాదేవీని అందుకున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఆయన బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే స్థిరాస్తి వ్యవహారాలతోపాటు ఆదాయ వనరులపై ఆయన కన్నేస్తూ అందినకాడికి దండుకున్నారనే ప్రచారముంది. ముఖ్యంగా తన వద్దకు వచ్చిన ప్రతి కేసును బట్టి ఎంత మొత్తంలో కాసులు కావాలనేది లెక్క చేయడం.. అందుకు అనుగుణంగా డిమాండ్ చేయడం సాధారణంగా జరిగే తంతు. ఇటీవల గల్ఫ్ మోసాలను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో చేపట్టిన తనిఖీల్లోనూ ఆయన చేతివాటాన్ని చూపించారట. పరారీలో ఉన్న వ్యక్తిని వెంటాడి పట్టుకుని.. ఎంతోకొంత బేరం పెట్టుకుని అతన్ని వదిలేసిన తీరుపై సొంతశాఖలో కొన్నాళ్లు చర్చ జరిగింది. తనిఖీల్లో పట్టుబడిన పత్రాలను తిరిగి తీసుకొచ్చుకునేందుకు కూడా ఇంత చెల్లించాలని ఈ పోలీసు సారు రేటు నిర్ణయించారట. బాధితులు ఒకరికొకరు ఫోన్‌లో మాట్లాడుకుంటూ.. సారుకింత పైసలు ముట్టజెప్పి పత్రాలు తెచ్చుకున్నామన్న సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఇలా అంతులేని ఆగడాలపై జనాల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్న వేళ.. ఉన్నతాధికారులు పక్కా విచారణతో చర్యలు తీసుకోవడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నేతలు, దళారులకు అండగా నిలిచి బాధితులను ఇబ్బంది పెట్టిన సారుపై ఇప్పటికైనా చర్య తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వరదొస్తే.. వాహనం ఆగుడే..!

భువనగిరి : మూసీ నది ఉప్పొంగితే చాలు బొల్లెపల్లి- సంగెం కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. వానాకాలం ఇది సర్వసాధారణమైనా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. వంతెన నిర్మిస్తామన్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగా మిగిలాయి. గత రెండు దశాబ్దాలుగా ఈ రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భువనగిరి నుంచి చౌటుప్పల్ వెళ్లేందుకు ఈ మార్గం దగ్గర అవుతుంది. దూరాభారం కూడా తగ్గుతుందని అప్పట్లో దివంగత మాజీ హోంమంత్రి మాధవరెడ్డి హయాంలో ఈ రహదారి మంజూరైంది. 1997 ప్రాంతంలో ప్రధాన మంత్రి సడక్ యోజన కింద బొల్లెపల్లి నుంచి సంగెం మీదుగా చౌటుప్పల్ వరకు 19 కిమీ పొడవున నూతనంగా ఈ రహదారి పనులు ప్రారంభించారు. 1999 ప్రాంతంలో కాజ్‌వేను ప్రారంభించారు. బొల్లెపల్లి-సంగెం మధ్యన మూసీ నదీ ప్రవహిస్తుండటంతో అప్పటి నదీ ప్రవాహాన్ని అంచనా వేసి కాజ్‌వే నిర్మాణం చేశారు. కానీ ప్రస్తుతం వరద నీటి ప్రవాహం పెరగడంతో వరద ఉధృతి పెరిగినప్పుడు కాజ్‌వే పై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. కార్యరూపం దాల్చేనా హైలెవల్ బ్రిడ్జి (హెచ్‌ఎల్‌బీ) నిర్మిస్తామని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. రోజు వందలాది వాహనాల రాకపోకలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. మూసీ ఉధృతి పెరిగినప్పుడు ఈ మార్గాన్ని మూసివేసి వలిగొండ-నాగారాం మీదుగా చౌటుప్పల్ వరకు వాహనాలను మళ్లిస్తున్నారు. భువనగిరి నుంచి చౌటుప్పల్ వెళ్లేందుకు సుమారు 14 కిమీ దూరాభారం పెరుగుతుంది. ఈ మార్గానికి ఉన్న ప్రాధాన్యం గుర్తించి ఉమ్మడి జిల్లాకు చెందిన రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హై లెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. రహదారి నిర్మించాలని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా మంత్రి వెంకట్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. మూసీ ఉధృతి దృష్ట్యా వంతెన నిర్మాణం చేపట్టాలని తాము ప్రభుత్వం దృష్టికి తెచ్చామని రోడ్లు భవనాల శాఖ ఈఈ శంకర్ కు తెలిపారు. రహదారికి మరమ్మతులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కోరితే వెంటనే ప్రతిపాదనలు పంపుతామన్నారు.

## ముఖం.. ఇక ముఖ్యం

సూర్యాపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పని వేళలో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పనికి వచ్చే కూలీలు తప్పనిసరిగా హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా కూలీల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి సిబ్బందికి శిక్షణ సైతం కల్పించారు. త్వరలో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముందుగా కొన్ని పంచాయతీల్లో ఇటీవల పరిశీలన చేశారు. అందులో లోపాల్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించారు.

వివాదాలకు అడ్డుకట్ట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1740 గ్రామ పంచాయతీల్లో 7,52,957 జాబ్ కార్డులు ఉండగా 15,94,138 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరుపై తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో సామాజిక తనిఖీల్లో మస్టర్లపై ఎన్నో లొసుగులు బయటపడ్డాయి. వాటికి అడ్డుకట్ట వేసేందుకు, పారదర్శకత, అర్హులకు న్యాయం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూలీలకు ముఖ



గుర్తింపు హాజరు విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఈ విధానంతో బోగస్ హాజరుకు అడ్డుకట్ట పడనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి జాబ్ కార్డుల్లోని సభ్యులందరికీ ఆధార్ అనుసంధానం చేశారు. పని ప్రదేశాల్లో తొలుత కూలీల ముఖ చిత్రాలను నమోదు చేస్తారు. తర్వాత కూలీ ఫొటో, ఆధార్‌తో అంతకుముందు దిగిన ఫొటో సరిపోలితేనే వారికి హాజరు పడుతుంది. పని చేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పనిసరిగా ఉంటుంది.

గుర్తించిన లోపాలు ఇవి..

పని ప్రదేశానికి కేవలం పది మీటర్ల పరిధిలోనే హాజరు నమోదు అవుతుంది. ఉదాహరణకు పంట కాల్వ పనులు చేస్తున్నప్పుడు ముఖ గుర్తింపు సాధ్యం కావడం లేదు. ముఖ గుర్తింపునకు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్ర సహాయకులు(ఎఫ్‌ఏ) చరవాణుల్లో అంతర్జాల వేగం సరిపోవడం లేదు. కనీసం 5జీ నెట్‌వర్క్ ఉండాలి. తరచూ స్టోరేజీ సమస్య ఏర్పడుతోంది. జిల్లాలో పలువురు ఎఫ్‌ఏలకు రెండు నుంచి ఆరు పంచాయతీల అదనపు బాధ్యతలున్నాయి. ఈ సమస్య పరిష్కరించి నూతన ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యాప్‌ను ప్రారంభించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు.

## ఖమ్మంలో రాయితీపై భారత్ దాల్

ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ప్రజలకు రాయితీపై భారత్ రైస్ (బియ్యం) సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా ఖమ్మం జిల్లాలో మాత్రం ఆ జాడ కన్పించడం లేదు. కిలో రూ.29కే నాణ్యమైన సన్న బియ్యం 5, 10 కిలోల ప్యాకింగ్‌లో మార్కెట్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు సర్కారు చెబుతోంది. ప్రజలు భారత్ రైస్ కోసం నిరీక్షిస్తున్నా జిల్లాకు మాత్రం చేరుకోలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో నాణ్యమైన సన్న బియ్యం రూ.50 నుంచి రూ.65 వరకు ధర పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీ బియ్యం అందుబాటులోకి వస్తాయని అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

శనగ పప్పు విక్రయాలు

ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని సమీకృత మార్కెట్‌లోని ఓ దుకాణంలో రాయితీపై భారత్ దాల్ మూడు రోజులుగా విక్రయిస్తున్నారు. హాకా (హైదరాబాద్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ అసోసియేషన్) భారత్ దాల్ మార్కెట్‌లో ఎంపిక చేసిన వ్యాపారులకు సరఫరా చేస్తోంది. పచ్చి శనగపప్పు (భారత్ దాల్) బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.85 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం హాకా ద్వారా సరఫరా చేస్తున్న భారత్ దాల్ కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. చాలామంది ఈ శనగపప్పును కొనుగోలు చేస్తున్నారు. భారత్ రైస్ ఎప్పుడు వస్తాయని పలువురు వినియోగదారులు ఆ దుకాణ నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. తమకు సైతం తెలీదని, శనగపప్పు ప్యాకెట్లు మాత్రం తెలిసిన వారి ద్వారా తెప్పించినట్లు నిర్వాహకులు బదులిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్న భారత్ రైస్, భారత్ దాల్‌కు ఖమ్మం జిల్లాలోని బహిరంగ మార్కెట్‌లో గిరాకీ అధికంగా ఉంది. కానీ లభ్యత శూన్యం. పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదించగా భారత్ రైస్, దాల్ సరఫరా, విక్రయాలపై తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మార్కెట్‌లోకి ఎలా వస్తుంది, జిల్లాలో ఎన్ని దుకాణాల్లో అందుబాటులోకి తెస్తున్నారు, ఎవరు విక్రయిస్తారు అనే అంశాలపై స్పష్టత లేదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ ద్వారా భారత్ రైస్ వినియోగదారులకు అందుబాటులోకి రావాల్సి ఉంది.

## రికార్డు స్థాయిలో కోకో ధర

అశ్వారావుపేట : కోకో పంట ధర రికార్డులను అధిగమిస్తోంది. కోకో గింజలకు అత్యధికంగా ప్రస్తుతం కిలో రూ.400 పలికింది. గత ఏడాది అత్యధికంగా రూ.240 ఉన్న ధర జనవరిలో రూ.320, రూ.340 పలికింది. తాజాగా కిలో గింజలు రూ.400కు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కొంతకాలంగా కోకోసాగు స్తబ్ధుగా సాగుతోన్న తరుణంలో తాజా ధర ఈ పంట సాగుపై రైతుల్లో మరింత ఆసక్తి పెంచుతోంది. ఇప్పటికే రైతులు వేలాది ఎకరాల్లో అంతరపంటగా కోకో సాగు చేస్తున్నారు. తెలంగాణలో కోకో సాగు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోనే వేలాది ఎకరాల్లో సాగవుతోంది. ఎక్కువగా ఆయిల్‌పాం, కొబ్బరితోటల్లో అంతరపంటగా దీనిని సాగు చేస్తున్నారు. కొబ్బరిలో కోకో అంతరపంటగా 200 మొక్కలు, ఆయిల్‌పాంలో 150 మొక్కలు పడతాయి. కాపు ప్రారంభం అయ్యాక ఏడాదికి సగటున ఆయిల్‌పాంలో 2.5 క్వింటాళ్లు, కొబ్బరిలో 3.5 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. కోకో పంట కొనుగోళ్లను రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్దే నిర్వహిస్తున్నాము. అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లి మండలాల్లో మా సిబ్బంది గింజలను నిత్యం కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ ఏడాది వచ్చిన కిలో రూ.400 ధరే ఇప్పటివరకు అత్యధికం. క్యాడ్‌బరీ సహాయ మేనేజర్ రవీంద్రనాథ్

# ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం

**హైదరాబాద్ మార్చి 2(ప్రభాత సమాచారం):**
తెలంగాణ ప్రజలకు రాష్ట్రప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ పథకం అమలుకు విధివిధానాలు, నిబంధనలు తయారు చేయాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ పథకంలో స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు అందించనున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మరో పథకం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది

# తెలంగాణలో 9మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన బిజెపి

### ముగ్గురు సిట్టింగులకు చోటు

### పెండింగ్ లో ఆదిలాబాద్ సిట్టింగ్ సీటు




**హైదరాబాద్ మార్చి 2(ప్రభాత సమాచారం)**
రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది.దేశ వ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలు ఉండగా తొలి విడతలో 195 స్థానాలకు లోక్‌సభ అభ్యర్థులను వెల్లడించింది. ఈ తొలి జాబితాలో తెలంగాణకు సంబంధించి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 17లోక్?సభ స్థానాలు ఉండగా తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం మరో ఎనిమిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.సికింద్రాబాద్ – కిషన్ రెడ్డి, నిజామాబాద్ – ధర్మపురి అరవింద్, కరీంనగర్ – బండి సంజయ్, జహీరాబాద్ – బీబీ పాటిల్, నాగర్ కర్నూల్ – భరత్ ప్రసాద్, మల్కాజిగిరి – ఈటల రాజేందర్, భువనగిరి – బూర నర్సయ్య గౌడ్, హైదరాబాద్ – డాక్టర్ మాధవి లత, చేవెళ్ల – కొండా విశ్వేశ్వర్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. బీజేపీ సిట్టింగ్?ల్లో ముగ్గురికి మరోసారి అవకాశం దక్కగా ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానాన్ని పెండింగ్?లో ఉంచింది. ఈ స్థానం నుంచి కొత్త వ్యక్తికి అవకాశం ఇస్తారా లేక సిట్టింగ్? వ్యక్తికే మరోసారి అవకాశం దక్కుతుందా అనేది వేచి చూడాలి.

# పంటలకు.. 18 గంటలు

నల్గొండ : నల్గొండ జిల్లాలో వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ కరెంటు సరఫరా చేసేందుకు విద్యుత్తు సంస్థ నడుం బిగించింది. నిత్యం రెండు విడతలుగా 18 గంటలకు తగ్గకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత భారాస ప్రభుత్వం బోరుబావులకు 24 గంటలు విద్యుత్తు సరఫరా ప్రారంభించిన విషయం తెలిసిందే. కానీ సాగు విస్తీర్ణం పెరగడంతో గత ఏడాది కాలంగా త్రీఫేజ్ సరఫరా సమయాన్ని కుదించారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు నాణ్యమైన విద్యుత్తు చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టింది. పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం మార్కెటులో కొనుగోలు చేస్తున్నాయి. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.10 చొప్పున నిత్యం 2000 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేసి సరఫరా చేపడుతోంది.

రెండు విడతలుగా..దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఆదేశాల మేరకు నల్గొండ సర్కిల్ పరిధిలో వ్యవసాయ బోరు బావులకు రెండు విడతలుగా విద్యుత్తు సరఫరా చేసేందుకు సంస్థ అధికారులు ప్రణాళిక తయారు చేశారు. జిల్లా పరిధిలో సుమారు 2.18 లక్షల వరకు బోరు బావులు ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంటే (12 గంటలు), అర్ధరాత్రి నుంచి తిరిగి ఉ



దయం 6 గంటల వరకు అంతరాయం లేకుండా సరఫరా చేపట్టనున్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే సరి చేసి 18 గంటలకు తగ్గకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

సామర్థ్యం పెంపు

జిల్లాలో పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా విద్యుత్తు ఉపకేంద్రాలపై లోడు పడకుండా వాటి సామర్థ్యం పెంచుతున్నారు. జిల్లాలో 25 ఉపకేంద్రాల్లో పవర్ నియంత్రికల సామర్థ్యం పెంపు, మరి కొన్ని చోట్ల ఉన్న వాటికి అదనపు పవర్ నియంత్రికల ఏర్పాటు చేపట్టింది. బైరవుని బండ, గుంటుపల్లి, ఇండ్లూరు, కొమ్మపాడు, త్రిపురారం విద్యుత్తు ఉపకేంద్రాల్లో ఇప్పటికే కొత్తవి ఏర్పాటు చేసి సామర్థ్యం పెంచారు. వీటికి అనుగుణంగా సుమారు రూ.3.55 కోట్ల వ్యయంతో 33 కేవీ లైన్లు 34కి.మీ, 11కేవీ లైన్లు 35 కిమీ మేర కొత్తగా విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి



**గంభీరావుపేట (సిరిసిల్ల)మార్చి 2 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి సిరిసిల్ల పట్టణం కుసుమరామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 154 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన హ్యూమన్ హెల్పింగ్ రోబోట్, ఆటో హోమ్ మిషన్,ఆర్ ఎఫ్ఐడీ అటెండెన్స్,రెయిన్ వాటర్ స్టోరేజ్,లెట్ డెఫ్ పీపుల్ అలర్ట్, చంద్రయాన్ తదితర ప్రాజెక్ట్ లను కలెక్టర్ పరిశీలించి,వాటి ఉపయోగం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల తయారీకి సహకరించిన గైడ్ టీచర్స్, ప్రాజెక్టులను వివరించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. చదువులోనూ రాణించాలని పేర్కొన్నారు.

**విజేతలు వీరే..**ఆర్ఎఫ్ఐడీ అటెండెన్స్ సిస్టం చేర్యాల శివతేజ,వడ్డేపల్లి లవన్ కుమార్, హ్యూమన్ హెల్పింగ్ రోబోట్ జీ సాయి తేజ, అజయ్, ఆటో హోమ్ మిషన్ బీ అఖిల, జాబిల్లి,రెయిన్ వాటర్ స్టోరేజ్ సిస్టం శివ,దత్రిష్,వివేక్, డెఫ్ పీపుల్ అలర్ట్ సిస్టం రాజేశ్వరి, వర్షిత ఉన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతిలాల్, మండల విద్యాధికారి దూస రఘుపతి, పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, సైన్స్ ఉపాధ్యాయులు పాకాల శంకర్ గౌడ్ సరిత, శ్రీహరి, రజిత, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవజన్మ లక్ష్యం పరమాత్మను చేరటమే సనాతన ధర్మం

### - మండల కేంద్రంలో రెండు వేల యువకులతో భవ్య యాత్ర

### - వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్



**గుడిహత్నూర్ మార్చి 2 (ప్రభాత సమాచారం)**
మానవజన్మ లక్ష్యం పరమాత్మని చేరుటయే అని చెప్పేది సనాత ధర్మం అని వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న పోచ్చమ మందిర ఆలయం నుంచి ఏక రూప దుస్తులతో సుమారు రెండువేల మంది యువకులతో భవ్య దివ్యశోబా యాత్రను ప్రధాన రహదారి గుండా రామనామ స్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. మండల మాన్కాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు సంత్ పూలజి బాబా ధన్య కేంద్రం వరకు తరలివెళ్ళారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ నేడు హిందువులందరని ఏకతాటిపైకి తీసుకురావాలన్న ఉద్దేశంతో సనాతన ధర్మ సమితిని స్థాపించడం జరిగిందని. ఇక నుంచి హిందువులపై ఎక్కడ దాడులు కాని అరాచకాలు జరిగిన సనాతన సేనా సమితి సభ్యులు సకాలంలో హాజరై వారికి అండగా నిలుస్తారని ఈ సంస్థలో వెయ్యి మంది యువకులు శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించి పరిరక్షణ కోసం పాటుపడనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు, యువకులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు

# పత్తి రైతుకు కొంత మేలు..!

ఖమ్మం : పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్ల నుంచి తప్పుకొంటే మార్కెట్లో ధరలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు సీసీఐ ఎండీకి లేఖ రాశారు. మంత్రి తీసుకున్న నిర్ణయంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పత్తి రైతులకూ ప్రయోజనం కలగనుంది. కొద్ది రోజుల నుంచి ఉభయ జిల్లాల్లో పత్తి కొనుగోళ్లు మందగించాయి. గతేడాది ఇదే సమయంలో పత్తి ధరలు పుంజుకున్నాయి. అందుకే రైతులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇళ్లల్లోనే సరకు నిల్వ ఉంచుకున్నారు. కొద్ది రోజుల నుంచి పత్తి ధరల్లో పెరుగుదల కన్పిస్తోంది. ఇటీవల ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా పత్తి గరిష్ఠ ధర రూ.7,100 చొప్పున ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,020. ఇప్పుడు అంతకుమించి లభిస్తోంది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వివిధ ప్రాంతాల నుంచి సరకు రాక

ఖమ్మం జిల్లాలోని సీసీఐ కేంద్రాలకు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఏపీలోని వివిధ జిల్లాల నుంచి రైతులు పత్తి తెస్తారు. ఉభయ జిల్లాల్లో ఇప్పటికీ రైతులు పత్తి ఏరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రెండో విడత, మరికొన్ని ప్రాంతాల్లో మూడో విడత పత్తి తీస్తున్నారు. రానున్న కాలంలో నిల్వలు మరింత పెరిగే అవకాశం ఉంది.

సీసీఐ కేంద్రాలు ఇవీ...

ఖమ్మం జిల్లాలో మొత్తం పది జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, కొత్తగూడెంలో కేంద్రాలున్నాయి. కొద్ది రోజుల నుంచి కొన్ని కేంద్రాలకు రైతులు సరకు తీసుకురావడం లేదు. సీసీఐ కేంద్రాలు ఇక మూసివేస్తారని రైతులు భావించారు. సీసీఐ కేంద్రాలు తెరిచి ఉంటేనే పోటీ మార్కెట్‌లో రైతులకు కొంత ఆశించిన ధర లభించే అవకాశం ఉంటుంది. సీసీఐ రంగంలో లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా కొనుగోళ్లకు పూనుకుంటే రైతులు నష్టపోతారు. అందుకే ఇప్పుడు సీసీఐ కేంద్రాలను మరికొంతకాలం పాటు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సీసీఐ కేంద్రాలు మరికొంతకాలం పాటు కొనసాగనున్నాయి. రైతులు నాణ్యమైన పత్తిని తెచ్చి అధిక ధర పొందాలి. కొద్దిరోజుల నుంచి పత్తి ధరల్లో పెరుగుదల కన్పిస్తోంది. రైతులకు ప్రయోజనం కలగనుంది.ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

# సాగుతూ.. ఆగుతూ

ఖమ్మం : ఉభయ జిల్లాల్లో అతి పెద్దదైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌పై భారాన్ని తగ్గించేందుకు ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులు సాగుతూ ఆగుతుండటంతో ఐదేళ్లయినా అన్నదాతలకు అందుబాటులోకి రాలేదు. మంత్రి ఆదేశాలతో కొద్దిరోజుల క్రితం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సమస్యలు చక్కదిద్ది వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికైనా మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.2018లో నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం మద్దులపల్లిలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికి రూ.15 కోట్ల మంజూరు చేసింది. నిర్మాణం కోసం సుమారు 24 ఎకరాల స్థలం కేటాయించింది. విపణికి అనుసంధాన రహదారి కోసం ఏదులాపురం పంచాయతీలోని ఆటోనగర్ నుంచి మార్కెట్ మీదుగా పొన్నెకల్లు వరకు బీటీ రహదారి మంజూరు చేసింది. జాప్యానికి కారణమేంటి? రైతుల సుదీర్ఘ ఆందోళనకు ముందు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సాగు చట్టాలతో ఉన్న మార్కెట్లనే మూసేసే పరిస్థితి నెలకొంది. ఆసమయంలో తెరపైకివచ్చిన మద్దులపల్లి మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. 2018లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయినా ముందస్తు ఎన్నికలు, కరోనా లాక్‌డౌన్, నూతన చట్టాల ప్రభావంతో 2021 వరకూ పనులు మొదలుకాలేదు. నూతన చట్టాల రద్దుతో ఆశలు జీవం పోసుకున్నాయి.మొదట పనులు దక్కించుకున్న వ్యక్తి ప్రారంభించకుండానే టెండర్ రద్దు చేసుకున్నాడు. టెండర్ రద్దుపై అప్పట్లో పలు విమర్శలు వెల్లువెత్తాయి. తరువాత మార్కెటింగ్ అధికారులు రీటెండర్ పిలిచారు. రూ.19.9 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు 2022 మే 4న నాటి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు సాగుతున్నాయి. మొత్తం నాలుగు షెడ్లకు సంబంధించి పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. ఆఫీసు గది స్లాబ్ దశలో ఉంది. మొత్తంగా చూస్తే కేవలం 30శాతమే



పూర్తయ్యాయి. మరో ఆరు నెలలైతే రెండోసారి టెండర్‌లో పనుల పూర్తికి విధించిన గడువు ముగుస్తుంది.

అమాత్యులు చొరవ చూపితే..మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణ స్థలంలో మట్టి తోలకాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అధికారులను మందలించారు. తాత్కాలికంగా పనులు ఆపేయాలని ఆదేశించారు. అందుకే పనులు నిలిచిపోయాయి. మట్టితవ్వకాలపై ప్రస్తుతం రెవెన్యూ, మైనింగ్ అధికారుల విచారణ సాగుతోంది. పాలేరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయంలో శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

### డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రజిత

**గంభీరావుపేట (సిరిసిల్ల )మార్చి 2(ప్రభాత సమాచారం)**పోలియో రహిత సమాజం కొరకు నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 394 పోలియో బూతులను జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుండి ఏర్పాటు చేయడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు.ఈ సందర్భంగా శనివారం వారు



మాట్లాడుతూ జిల్లాలో 5 సంవత్సరాలలోపు ఉన్న 44,770 పిల్లలు అందరూ పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాలని అందుకోసం తల్లిదండ్రులు అందరూ అప్పుడే పుట్టిన పిల్లవాని నుంచి ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

# తాండూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కుమారస్వామి




**తాండూర్, మార్చి2(ప్రభాత సమాచారం)**
తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కె కుమారస్వామి శనివారం తాండూర్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తాండూర్ సీఐ గా విధులు నిర్వహించిన ఎం శ్రీనివాసరావు మల్టీ జోన్ 1 కార్యాలయానికి బదిలీ అయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో బదిలీలు చేపట్టింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తాండూర్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు మొదట ప్రాధాన్యత ఇస్తానన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డయల్ 100 ను ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలకు సమస్యలు ఏర్పడితే ప్రజలు నేరుగా తనను సంప్రదించాలని,తాండూర్ సర్కిల్ ప్రజలకు అందుబాటులో ఉండి సర్కిల్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సిఐ తెలిపారు.

# బండి అభ్యర్థిత్వం ఖరారు పై గంభీరావుపేట బీజేపీ శ్రేణుల సంబరాలు



**గంభీరావుపేట మార్చి 2(ప్రభాత సమాచారం)**
భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ని కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించినందుకు శనివారం గంభీరావుపేట భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంటా అశోక్, ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాజిరెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్యం పురం రాజు గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, గౌడ్, గుర్రపు నాగరాజు,మల్లేష్ యాదవ్, మహేష్ యాదవ్, బిక్షపతి,రాజిరెడ్డి,సాయి తదితర పాల్గొన్నారు.


# ఆర్టికల్ 370 రద్దు తర్వాత.. తొలిసారి కశ్మీర్ లోయకు మోదీ..!



దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి కశ్మీర్ లోయలో పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మార్చి 7వ తేదీన శ్రీనగర్‌లో జరిగే ర్యాలీలో ప్రధాని పాల్గొననున్నట్లు తెలిపాయి. శ్రీనగర్‌లోని షేర్ ఈ కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో ప్రధాని సభ జరగనున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. మోదీ పర్యటనను పురస్కరించుకుని కశ్మీర్ లోయలో ఇప్పటికే హైఅలర్ట్ ప్రకటించినట్లు తెలుస్తోంది.

ఈ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు.. వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఫిబ్రవరి 20న ప్రధాని జమ్మూలో పర్యటించిన సంగతి తెలిసిందే. రూ.32వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019 ఆగస్టులో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. అప్పటి నుంచి ప్రధాని మోదీ మూడు సార్లు జమ్మూలో పర్యటించగా.. కశ్మీర్ లోయకు వెళ్లడం మాత్రం ఇదే తొలిసారి. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని పర్యటన కీలకంగా మారింది.

# యాదాద్రి కాదు.. యాదగిరిగుట్టనే



యాదగిరిగుట్ట : యాదాద్రిని మళ్లీ యాదగిరిగుట్టగా పేరు మారుస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ఆలయ సన్నిధిలో వెల్లడించారు. టెంకాయ కొట్టే స్థలాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ క్షేత్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, త్వరలోనే క్షేత్ర సందర్శనకు రానున్నట్లు విప్ తెలిపారు. నెల రోజుల్లోగా సమీక్ష సమావేశం నిర్వహించి క్షేత్రానికి పూర్వ సంప్రదాయం చేకూర్చేలా కృషి చేస్తానన్నారు. కొండపై డార్మిటరీ హాల్ నిర్మించి భక్తులు నిద్ర చేసే అవకాశం కల్పిస్తామన్నారు. పది రోజుల్లో హాల్ నిర్మాణం చేయాలని సూచించారు. పూర్వం నుంచి ఈ క్షేత్రానికి ఉన్న పేరు మార్చడం సరికాదన్నారు. ఆలయ పూజారుల కోసం విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత ఈవో రామకృష్ణారావు, ధర్మకర్త నరసింహమూర్తి స్వాగతం పలికారు. దైవ దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వై.సుధ పాల్గొన్నారు.




# 10.80 లక్షల కుటుంబాలకు మాత్రమే లబ్ధి

హైదరాబాద్: ఆహార భద్రత (రేషన్) కార్డుతో మెలిక పెట్టడంతో గ్రేటర్‌లో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. అర్హతలున్నా..కేవలం రేషన్ కార్డులు లేని కారణంగా దాదాపు 18 లక్షల కుటుంబాలు ఈ పథకాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై లబ్ధిదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మహానగరంలో దారిద్ర్యరేఖకు దిగువనగల దాదాపు 38 శాతం పైగా కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్, జీరో విద్యుత్ బిల్లు లబ్ధి చేకూరనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రూ. 500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలు ప్రారంభించారు. ప్రభుత్వం రెండు పథకాల వర్తింపునకు రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాలను మాతమే అర్హులుగా గుర్తించింది. అయితే..నగర పరిధిలో సగానికి పైగా నిరుపేద కుటుంబాలకు రేషరీన్ కార్డులు లేవు. గత పదేళ్లలో అనేక కుటుంబాల్లోని సభ్యులు వివాహాలతో వేరుపడగా, మరోవైపు కొత్త రేషన్ కార్డుల మంజూరు మొక్కుబడికి పరిమితమైంది. దీంతో రేషన్ కార్డులు లేని కుటుంబాల సంఖ్య బాగా పెరిగింది.

**బీపీఎల్ కుటుంబాలు 28 లక్షలపైనే..** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు 48 లక్షలకుపైగా కుటుంబాలు ఉండగా..అందులో దారిద్ర్యరేఖకు దిగవన గల కుటంబాలు 28 లక్షలకుపైగా ఉన్నాయి. అందులో తెల్లరేషన్ కార్డులు కలిగిన కుటుంబాలు 17.21 లక్షల వరకు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర జిల్లాల తెల్ల రేషర్షిన్ కార్డులు కలిగిన కుటుంబాలు మరో ఐదు లక్షలకు పైగా ఇక్కడే నివసిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరో ఆరు లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. అందులో ఇటీవల జరిగిన ప్రజా పాలనలో సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వాస్తవంగా గత పదేళ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నగర పరిధిలో కేవలం 1.27 లక్షల కొత్త రేషన్ కార్డులు మాత్రమే మంజూరు చేసింది. పెళ్లిళ్లయి కొత్తగా ఏర్పాటైన చాలా కుటుంబాలకు రేషర్షిన్ కార్డులు లేవు. అలాంటి కుటుంబాలు సుమారు 10 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. అందులో సగం కుటుంబాల వరకు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం.

**10.80 లక్షల కనెక్షన్లకే వర్తింపు** : మహానగర పరిధిలో సుమారు 10.80 లక్షల గ్యాస్, విద్యుత్ కనెక్షన్లకు మాత్రమే పథకాలు వర్తించనున్నాయి. అధికారికంగా గృహోపయోగ వంట గ్యాస్ కనెక్షన్లు కలిగిన కుటుంబాలు సుమారు 30 లక్షల వరకు ఉండగా, మరో పది లక్షల అనధికార కనెక్షన్లు ఉన్నట్లు అంచనా.

అదేవిధంగా గృహోపయోగ విద్యుత్ కనెక్షన్లు సుమారు 48.03 లక్షలకు పైగా ఉండగా, అందులో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలు సుమా రు 30 లక్షలకుపైగా ఉన్నట్లు అధికారుల అంచనా. ప్రజాపాలన సందర్భంగా దాదాపు 19.80 లక్షల వరకు కుటుంబాలు సబ్సిడీ వంటగ్యాస్, ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ వీటికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి చేయడంతో అందులో సుమారు 10.80 లక్షల కుటుంబాలు మాత్ర మే అర్హత సాధించాయి. దీంతో మిగతా కు టుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

# అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్: సీఎం రేవంత్



హైదరాబాద్: అంగన్వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖపై అధికారులతో సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు ఉండేలా చూడాలని ఆదేశించారు. కేంద్రాలకు సొంత భవనాలపై దృష్టి సారించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షకు హాజరయ్యారు.





# అసెంబ్లీ సమావేశాలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 2: అసెంబ్లీ సమావేశాలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో దివంగత స్పీకర్ శ్రీపాద రావు జయంతి వేడుకల్లో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ళలో శాసనసభ సరిగా నిర్వహించలేదన్నారు. ప్రజలకు శాసనసభలో ఏం అవుతుందో కూడా తెలియకపోయేదని అన్నారు. గత ప్రభుత్వం ప్రతిపక్షాలను మాట్లాడనివ్వలేదని విమర్శించారు. కొత్త ప్రభుత్వంలో శాసనసభలో డిబేట్ జరుగుతోందన్నారు. శాసనసభ డిబేట్లను కోట్లాది మంది చూస్తున్నారన్నారు. చిన్న పిల్లలు కూడా శాసనసభలో జరుగుతున్న సమావేశాలపై చర్చించుకుంటున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీపాదరావు గురించి మాట్లాడుతూ... శ్రీపాదరావు అసెంబ్లీలో ఉన్న సమయంలో తాను లేనందుకు బాధగా ఉంటుందన్నారు. శాసనసభ ఉన్నంత వరకు శ్రీపాద రావుని స్మరించుకుంటూనే ఉందామని స్పీకర్ చెప్పుకొచ్చారు.

# 'హరీశ్‌రావు కూడా బీజేపీలోకి పోతాడు': కోమటిరెడ్డి



హైదరాబాద్: యాదాద్రి కాదు ఇకపై యాదగిరిగుట్టగా పిలువబుడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తూ త్వరలోనే జీఓ విడుదల చేస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడాడు. 'ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పటికీ తండ్రి కేసీఆర్ చాటు కొడుకే. నేను ఉద్యమాలు చేసి వచ్చాను. మేం జీరో బిల్ ఇచ్చినట్టు.. కేటీఆర్‌కి జీరో నాలెడ్జ్ ఉంది.

నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడడం వృథా. ఫ్లోర్ లీడర్ ఇవ్వకపోతే హరీష్ కూడా బీజేపీలోకి పోతాడు. కాళేశ్వరం కట్టిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ మేడిగడ్డ ఎందుకు పోలేదు?. కాళేశ్వరం పనికిరాదని ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చింది.

ప్రజలే కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేశారు. ఎంపీ అభ్యర్థులపై అంతర్గత సర్వే జరుగుతోంది. భువనగిరి నుండి పోటీ చేయమని రాహుల్ గాంధీని కోరాను. భువనగిరి, ఖమ్మం, నల్గొండ లో.. దక్షిణాదిలో టాప్ మెజార్టీ వస్తుంది. మోదీ కంటే రాహుల్ గాంధీ ఎక్కువ మెజారిటీతో గెలుస్తారు' అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్.. కాలేజ్ కోసం వేసిన రోడ్డును...



హైదరాబాద్, మార్చి 2: మాజీ మంత్రి మల్లారెడ్డికి అధికారులు షాకిచ్చారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్‌లో మల్లారెడ్డి వేసిన రోడ్డును అధికారులు తొలిగించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్‌లో 2500 గజాల భూమిని మల్లారెడ్డి ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేశారు. కాలేజీ కోసం మాజీ మంత్రి రోడ్డును వేసుకున్నారు.

అయితే ఈ వ్యహారంపై గతంలో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూమి అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలతో ఈరోజు (శనివారం) హెచ్ఎండీఏ లే అవుట్‌లో మల్లారెడ్డి వేసిన రోడ్డును అధికారులు తొలగించేశారు.

**నన్ను కావాలనే కొంతమంది టార్గెట్ చేశారు** : తనను కావాలనే కొంతమంది టార్గెట్ చేశారని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధింపు చేస్తోందన్నారు. అధికారం వాళ్ల చేతుల్లో ఉంది కాబట్టి ఏమైనా చేస్తారన్నారు. హెచ్ఎండీఏ అధికారుల అనుమతి తీసుకునే అప్పట్లో కాలేజ్‌కి రోడ్డు వేశామన్నారు. 2500 గజాల స్థలానికి ప్రత్యామ్నాయంగా స్థలాన్ని మున్సిపాలిటీకి ఇచ్చామన్నారు. కాలేజ్ రోడ్డు తొలగించడంతో 25 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఇక పై మా కాలేజ్ వద్ద ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతుందని మల్లారెడ్డి అన్నారు.

# ఆ సంప్రదాయాన్ని సీఎం రేవంత్ పాటిస్తే బాగుంటుంది...



హైదరాబాద్, మార్చి 2: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారు. ఈనెల 4, 5 తేదీలో ప్రధాని పర్యటన సాగనుంది. ప్రధాని పర్యటనపై తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానాలుంటాయని తెలిపారు. ప్రధాని రాష్ట్రానికొస్తే.. గవర్నర్, సీఎం, అధికారులు స్వాగతం పలకటం సంప్రదాయమని.. అయితే ఈ సంప్రదాయాన్ని మాజీ సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ప్రధానికి స్వాగతం పలకాలని కోరుకుంటున్నానని... వస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. ఎల్లుండి (మార్చి 4) రాష్ట్రానికి పీఎం మోదీ వస్తున్నారని తెలిపారు. 4న ఆదిలాబాద్‌లో 6వేల 600కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి.. బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. 5న సంగారెడ్డిలో 9వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు.. బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారన్నారు.

**మేడిగడ్డపై..** మేడిగడ్డకు అందరి కంటే ముందు తామే వెళ్లామని... మేడిగడ్డపై డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్ట్ సరైనదే అని చెప్పుకొచ్చారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్‌ను పొలిటికల్ రిపోర్ట్ అంటూ బీఆర్ఎస్ చేసిన కామెంట్స్‌ను కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.

# డ్రగ్స్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చిన క్రిష్..

హైదరాబాద్: రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో గచ్చిబౌలి పోలీసుల ఎదుట డైరెక్టర్ క్రిష్ విచారణకు హాజరయ్యారు. తాజాగా పోలీసులు ఇచ్చిన నోటీసులకు స్పందించిన క్రిష్ విచారణకు హాజరై డ్రగ్స్ టెస్ట్‌ల కోసం శాంపిల్స్ ఇచ్చారు. దాదాపు నాలుగు గంటల విచారణ జరిపి పోలీసులు శాంపిల్స్ తీసుకుని క్రిష్‌ను పంపించేశారు. క్రిష్ బ్లడ్ యూరిన్ శాంపిల్స్‌ను పోలీసులు ల్యాబ్‌కు పంపించారు. టెస్ట్‌లో పాజిటివ్ అని తేలితే అరెస్ట్ చేసే అవకాశం ఉంది. అయితే డ్రగ్ టెస్ట్ లో నెగటివ్ వచ్చిన విట్‌నెస్ కింద క్రిష్‌ను మరోసారి పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది. కాగా.. విచారణకు హాజరైన క్రిష్‌ను రాడిసన్ హోటల్‌లో పార్టీ, డ్రగ్స్ వాడకం గురించి డీసీపీ ప్రశ్నలడిగినట్లు తెలిసింది. వీటికి జవాబుగా వేరే కార్యక్రమానికి హాజరవాల్సి ఉందని, స్నేహితుడు రఘుచరణ్ ఫోన్ చేస్తే రాడిసన్‌కు వెళ్లానని, అరగంట మాత్రమే ఉన్నానని చెప్పినట్లు సమాచారం. తాను డ్రగ్స్ తీసుకోలేదని, పార్టీలో డ్రగ్స్ వాడిన విషయం తెలియదని వెల్లడించినట్లు తెలిసింది. సమయానికి అందుబాటులో లేకపోవడం, సినిమా చర్చలకు ముంబై వెళ్లడంతో పోలీసులు పిలిచినపుడు రాలేకపోయినట్లు సమాధానమిచ్చారు. తప్పు చేయనందునే జరిగిన విషయం వివరించడానికి వచ్చానని క్రిష్ చెప్పినట్లు తెలిసింది. వీటికి డీసీపీ సంతృప్తి చెంది.. డ్రగ్స్ పరీక్షలు కచ్చితంగా చేయాలని, సహకరించాలని కోరారు. సిద్ధమని క్రిష్ చెప్పడంతో.. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని ఇన్‌స్పెక్టర్‌ను డీసీపీ ఆదేశించారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660